సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024

భక్తి శ్రద్ధలతో పవిత్ర మాలల సమర్పణ



ఒంటిమిట్ట కోదండరామాలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి ఉత్సవ నిర్వహకులు వీణా మనోజ్ కుమార్‌చార్యులు పవిత్రమాలలను భక్తి శ్రద్ధలతో సమర్పించారు. సీతారామ, లక్ష్మణ మూర్తులను పట్టువస్త్రాలతో అందంగా అలంకరించారు. యాగశాలలో విశ్వక్సేన ఆరాధన తదితర పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. –ఒంటిమిట్ట

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.270	రూ.320
రెండోరకం	రూ.200	రూ.266

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 210 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

'వెలిగల్లు' లో గణేష్ విగ్రహాల నిమజ్జనం నిషేధం



వెలిగల్లు జలాశయం

గాలివీడు: వెలిగల్లు జలాశయంలో గణేష్ విగ్రహాల నిమజ్జనం నిషిద్ధమని వెలిగల్లు ప్రాజెక్టు డీఈఈ శిరీష్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా గణపతి విగ్రహాల నిమజ్జనం వెలిగల్లు జలాశయంలో కాకుండా ఇతర ప్రాంతాల్లో జరిగేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు లేఖ రాసినట్లు చెప్పారు. వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా లక్కిరెడ్డిపల్లి, రామాపురం, గాలివీడు,రాయచోటి మండలాలకు సాగు, తాగునీటి సౌకర్యం కల్పించాల్సి ఉందన్నారు. వినాయక ప్రతిమలకు వినియోగించే రంగులు, రసాయనిక వ్యర్థాలతో గణేష్ నిమజ్జనం చేయడం ద్వారా నీటి కాలుష్యం జరిగే ప్రమాదం ఉందన్నారు. జల కాలుష్యం నివారణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

పంటకోత ప్రయోగాలు సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి చంద్రానాయక్

రాయచోటి: జిల్లాలో పంటకోత ప్రయోగాలను వ్యవసాయశాఖ సిబ్బంది సక్రమంగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వ్యవసాయం, ప్రణాళిక విభాగాల ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగాలు, ఈ–పంట నమోదుపై జిల్లాలోని అసిస్టెంట్ స్టాటికల్ అధికారులు, వ్యవసాయ అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ పంటకోత ప్రయోగాల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను అంచనా వేయడం, రుణ ప్రణాళిక తయారు చేయనున్నట్లు చెప్పారు. వ్యవసాయ సిబ్బంది ఇ–పంట నమోదు చేయాలని, దీని ఆధారంగా రైతులకు పంటలబీమా, పంటనష్ట పరిహారాలు వర్తిస్తాయని తెలిపారు. ప్రణాళిక అధికారి వెంకట పెద్దయ్య మాట్లాడుతూ అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారులు అందరూ ఇ–పంట కోత ప్రయోగాలపై మండల స్థాయిలో వ్యవసాయ సిబ్బందికి శిక్షణ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షణ అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్‌లో 30 రోజులు, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లో 30 రోజులు, ఎంబ్రాయిడరీ ఫ్యాబ్రిక్ పెయిటింగ్‌లో 30 రోజులు, జ్యూట్ బ్యాగుల తయారీలో 13 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు కెనరా బ్యాంకు ఆర్‌సెటి మేనేజర్ ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9వ తేది నుంచి శిక్షణ ఇవ్వనున్నామని, 18–45 ఏళ్లలోపు మహిళలు అర్హులన్నారు. వివరాలకు 94409 05478, 99856 06866, 94409 33028 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'వేంపల్లె షరీఫ్'కు అరుదైన గౌరవం



కడప కల్చరల్: కడప జిల్లా వేంపల్లెకు చెందిన కథా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత వేంపల్లె షరీఫ్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఆయన రాసిన 'ఆకు పచ్చ ముగ్గు'కథను రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశంగా ఎంపికచేసింది. కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్ ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది నుంచి సామాజిక శాస్త్రాలు చదువుతున్న డిగ్రీ విద్యార్థుల్లో యునెస్కో ప్రతిపాదించిన శాంతి మరియు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ప్రత్యేకంగా ఒక పేపరును 50 మార్కుల కోసం ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా వేంపల్లె షరీఫ్ రాసిన కథ 'ఆకుపచ్చ ముగ్గు'ను ఎంపిక చేశారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ చదువుతున్న విద్యార్థులకు మూడో సెమిస్టర్ కింద ఈ కథ ఉంటుంది. ఈ సెమిస్టర్ లో వేంపల్లె షరీఫ్ కథతోపాటు రావిశాస్త్రి రాసిన ''పిపీలికం', పోలా ప్రగడ రాజ్య లక్ష్మి రాసిన ''నల్లపూసలు', పెనుమాక రత్నాకర్ రాసిన ''ఈ పొలం అమ్మబడును'రచనలు పాఠ్యాంశాలుగా ఎంపికయ్యాయి. రావిశాస్త్రి వంటి గొప్ప కథలతో పాటు తన కథను ఎంపిక చేసినందుకు రచయిత వేంపల్లె షరీఫ్ ఈ సందర్భంగా పాఠ్యాంశ రూపకర్తల కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులు

గురుపూజోత్సవంలో జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, డీఈఓలు



గురుపూజోత్సవం కార్యక్రమంలో భాగంగా నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

రాయచోటి: విజ్ఞానాభివృద్ధికి గురువు పునాది లాంటివారని.. సమాజాభివృద్ధికి మార్గదర్శకం చేస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తారని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. నా ఉన్నతికి దోహదపడింది గురువులే అని ఆయన చెప్పారు. గురువారం రాయచోటిలోని లయ గార్డెన్స్ హాలులో మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అలాగే మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పురాతన కాలం నుంచి సమాజంలో గురువును స్మరిస్తూ వారి ప్రాముఖ్యతను, విద్య పూర్తయిన తర్వాత గురువును సత్కరించే చక్కని సంస్కారం కలిగిన సమాజం మనదని చెప్పారు. జిల్లాలో విద్య నాణ్యత పెంచడానికి పట్టణ, మండల, గ్రామీణ పాఠశాలల అంతరాలను తగ్గించడానికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి అభినందనలు తెలుపుతున్నానని అన్నారు. ఉపాధ్యాయుల పాత్ర బహు విధాలుగా ఉంటుందని చెప్పారు.

నవసమాజ స్థాపనకు కృషి చేయాలి

డాక్టర్ సర్వేపల్లి ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ఉపాధ్యాయులు భావి భారత నవ సమాజ స్థాపనకు కృషి చేయాలని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. గురువులు అందించిన విద్య కారణంగా అబ్దుల్ కలాంటి లాంటి ఎంతో మంది మహనీయులు ఆదర్శనీయంగా నిలిచారన్నారు. భావి భారత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దే ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. నేటి విద్యార్థులే దేశానికి రేపటి రోజున దిశ దశ మార్గదర్శకులు అవుతారని చెప్పారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారందరికీ నా అభినందనలు. ఉపాధ్యాయులు విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

- జిల్లాలో విద్యాభివృద్ధికి, విద్యా ప్రమాణాలు నాణ్యతకు పాటుపడుతున్న ఉపాధ్యాయులందరికీ జిల్లా విద్యాధికారి శివప్రకాష్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు.
- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు ఘనసన్మానం: జిల్లా వ్యాప్తంగా 81 మంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను కలెక్టర్, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డిలు ఘనంగా సత్కరించారు. జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, డిప్యూటీ డీఈఓలు, మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘ నేతలు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

రాయచోటి లయ గార్డెన్ పంక్షన్ హాల్‌లో నిర్వహించిన గురుపూజోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గురువారం సాయంత్రం కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు స్కాట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు గార్డ్ ఆఫ్ హానర్ (గౌరవ వందనం) ప్రదర్శించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, డీఈఓ శివప్రకాష్‌రెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమీషనర్ లక్ష్మీకర్, స్కాట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, నోబుల్ టీచర్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులు కొండూరు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్, ఎమ్మెల్యే చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న సుండుపల్లి ఎంఈఓ రవీంద్రనాయక్



ఎస్జీటీ ఉపాధ్యాయుడు టి.నాగభూషణ్‌రెడ్డి



పురస్కారంతో పీఈటీ రెడ్డప్ప



స్కూల్ అసిస్టెంట్ రమణయ్య




ఎస్జీటీ రామకృష్ణారెడ్డి



పుల్లంపేట మండలం స్కూల్ అసిస్టెంట్ పీఈటీ పార్థసారథి



రాయచోటి డైట్ ప్రిన్సిపల్ జ్యోతిర్మయి



రామసముద్రం ఏపీ మోడల్ స్కూల్ స్కాట్ అధికారి నాగరాజు



మదనపల్లె బాలుర హైస్కూల్ హెడ్మాస్టర్ సుబ్బారెడ్డి

నిధుల దుర్వినియోగంపై విచారణ



రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ

సుండుపల్లె: మండల అభివృద్ధి కార్యాలయంలో నిధుల దుర్వినియోగంపై ఉమ్మడి వైఎస్సార్ జిల్లా జెడ్పీ డిప్యూటీ సీఈఓ జీవీ రమణారెడ్డి విచారణ చేపట్టారు. గత నెల 17వ తేదీన మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బండి ఈశ్వర్ నిధుల దుర్వినియోగంపై అన్నమయ్య జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జెడ్పీసీఈఓ 2023–2024, 2024–25 ఆర్థిక సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధి పనులు 15వ ఆర్థిక సంఘం నిధులు, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బండి ఈశ్వర్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధుల్లో మూడే ప్రవీణ్ కుమార్ నాయక్ పేరు మీద రూ. 13,15,515.. లక్కిరెడ్డి మండలానికి చెందిన పెద్దిరెడ్డి సురేంద్రరెడ్డి పేరుమీద రూ. 12,44,446లు, మండల జనరల్ ఫండ్ నుంచి రూ. 11,98,628 ఎలాంటి పనులు చేయకుండానే చేసినట్లు మొత్తం రూ. 37,58,609 బిల్లులు చెల్లించి ఎంపీపీ అవినీతికి పాల్పడ్డారని ఈశ్వర్ జెడ్పీ డిప్యూటీ సీఈఓకు తెలిపారు. మడితాడు గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా వీధి దీపాల కోసం రూ. 8 లక్షలు, పెద్దబలిజపల్లికి రోడ్డు వేయకుండానే వేసినట్లు బిల్లులు చేసుకున్నారని తెలిపారు జెడ్పీ డిప్యూటీ సీఈఓ మాట్లాడుతూ రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

కడప అర్బన్: ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజినల్ అధికారిగా జి. శ్రీనివాసరావు గురువారం కడపలోని తమ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈయన 1989 బ్యాచ్ ఎస్ఐగా విధుల్లో చేరారు. 2010లో సీఐగా, 2014లో డీఎస్పీగా, 2023లో అదనపు ఎస్పీగా పని చేశారు. గుంటూరు జిల్లా నివాసి అయిన ఈయన నెల్లూరు, ప్రకాశం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలో ఎస్ఐగా, సీఐగా, డీఎస్పీగా, అదనపు ఎస్పీగా విధులను నిర్వహించారు.

అందుబాటులో 5.15 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి : మూడు రీచుల ద్వారా జిల్లా ప్రజలకు 5.15 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులోకి తీసుకురావడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. గురువారం రాయచోటి కలెక్టరేట్ లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో విలేకరులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు... అన్నమయ్య జిల్లాకు సంబంధించి రాజంపేట మండలం బోడుకుంటపల్లి సమీపంలోని చెయ్యేరు నదిలో మూడు ఇసుక రీచ్ లు ఏర్పాటు చేశామన్నారు. ఒకటో రీచ్‌లో 2.28 లక్షల మెట్రిక్ టన్నులు, రెండో రీచ్ లో 95,700 మెట్రిక్ టన్నులు, మూడోరీచ్ లో 1.92 లక్షల మెట్రిక్ టన్నులు మొత్తంగా 5.15 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు గుర్తించిన ఏజెన్సీల ద్వారా ఇప్పటికే 10,000 మెట్రిక్ టన్నుల ఇసుకను స్టాక్ పాయింట్‌లో పోగు చేశారు. ఇసుక బుకింగ్ నిమిత్తం రాయచోటి, మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల వినియోగదారులకు సానిపాయ సచివాలయంలో, రాజంపేట, రైల్వే కోడూరు నియోజకవర్గాల వినియోగదారులకు కూచువారిపల్లి గ్రామ సచివాలయాలలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు బుకింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బుకింగ్ కేంద్రాలను రాజంపేట రాయచోటి మదనపల్లెలలో ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ చెప్పారు. ఈనెల 6న జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో బుకింగ్ కేంద్రాన్ని ప్రారంభించడం జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. ఇసుకను బుకింగ్ చేసుకున్న తర్వాత రసీదుతో తీసుకెళ్లిన వాహనాన్ని చెక్‌పోస్టు ద్వారా అనుమతించడం జరుగుతుందన్నారు. చెక్ పోస్టు వద్ద పోలీసు రెవెన్యూ మైనింగ్ ఇరిగేషన్ శాఖ అధికారులు ఉండి రశీదు ఉన్న వాహనాలను మాత్రమే అనుమతిస్తారని తెలిపారు. కేవలం నిర్వహణ చార్జీలు, రవాణా చార్జీలు మాత్రమే వినియోగదారుడు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో నీటి ఎద్దడి ఉన్న 31 హ్యాబిటేషన్లలో ప్రస్తుతం నీటి రవాణా జరుగుతోందని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మైనింగ్ అధికారి రవికుమార్, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి భరత్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నియంత్రణకు చర్యలు చేపట్టాలి

జిల్లాలో డెంగీ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులపై మెడికల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. మదనపల్లె ప్రాంతంలో డెంగీ కేసులు ఎక్కువగా ఉన్నాయని, వీటి నివారణకు వైద్యశిబిరాలు విరివిగా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, జిల్లాలోని మెడికల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పాపం అయ్యోరు!

ఉపాధ్యాయుల సొంతింటి కల సాకారానికి టీడీపీ నేతలు అడుగడుగునా అడ్డుపడుతున్నారు. అయ్యవార్ల ప్లాట్లు కాజేయడమే లక్ష్యంగా పచ్చ పన్నాగాలు పన్నుతున్నారు. ఓ సారి నకిలీ పత్రాలతో.. మరోసారి బెదిరింపులతో రకరకాల కుట్రలు చేస్తున్నారు. తాజాగా ఉపాధ్యాయ దినోత్సవం రోజే టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యాలయంపై దాడికి తెగబడ్డారు. టీచర్లకు టీడీపీ ఇచ్చే బహుమానం ఇదేనా..! అంటూ పలువురు టీచర్లు వాపోతున్నారు.

- ఉపాధ్యాయ హౌస్ బిల్డింగ్ సొసైటీ స్థలాలపై టీడీపీ పెద్దల కన్ను
- ప్రారంభానికి సిద్ధమైన సొసైటీ కార్యాలయంపై దాడి
- ఉపాధ్యాయ దినోత్సవం రోజు టీడీపీ నేతలిచ్చే బహుమానం ఇదేనా..? టీచర్ల ఆవేదన



హౌస్ బిల్డింగ్ కార్యాలయంపై దాడి దృశ్యాలు

సాక్షి ప్రతినిధి, కడప: సొంతిల్లు.. మధ్య తరగతి కల.. అలాంటి కలను సాకారం చేసుకునేందుకు 35ఏళ్లుగా టీచర్లు ఎదురుచూస్తున్నారు. హౌస్ బిల్డింగ్ సొసైటీ ద్వారా సంక్రమించిన ఫ్లాట్‌లో ఇళ్లు కట్టుకోవాలని భావించారు. ఎదుగుబొదుగు లేని ఫ్లాట్స్ డెవెలప్‌మెంట్ చేసుకోవాలనే దిశగా సంఘటితమయ్యారు. అంతే ఆ ప్లాట్లపై టీడీపీ గ(పె)ద్దలు ఒక్కసారిగా వాలిపోయాయి.

వివరాల్లోకి వెళితే.. 1989లో టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కడప రూరల్ పబ్బాపురం గ్రామ పరిధిలో 88 ఎకరాలు కొనుగోలు చేసింది. అందులో 1430 మంది ఉపాధ్యాయులకు ఇంటి స్థలాలు కేటాయించారు. అప్పట్లో ఆ భూమి నగరానికి దూరంగా ఉండేది. కాలక్రమేణా రింగ్‌రోడ్డు అందుబాటులోకి రావడంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. అంతే ఆ భూములపై కొందరి కన్ను పడింది. ఈ క్రమంలో సుమారు 17 ఏళ్ల తర్వాత అంటే 2006లో తమ సమ్మతి లేకుండా కొనుగోలు చేశారని శోత్రియందారులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు మరో పదేళ్ల తర్వాత తీర్పు వెలుబడింది. టీచర్స్ అప్పీల్‌కు వెళ్లిన తర్వాత 1/3 వంతు శోత్రియం హక్కుదారులకు ఇవ్వాలని ఆదేశించింది. కేవలం 20 ఎకరాలను మాత్రమే శోత్రియందారుల ప్రమేయం లేకుండా కొనుగోలు చేశారని, అందులో 1/3 వంతు ఇవ్వాల్సి ఉంటుందని టీచర్లు వివరిస్తున్నారు. ఈ లెక్కన దాదాపు 6.66 ఎకరాలు మాత్రమే అప్పజెప్పాల్సి ఉంటుంది. అయితే భవిష్యత్‌లో ఎలాంటి ఆటంకాలు రాకుండా ఉండాలని హౌస్ బిల్డింగ్ సొసైటీ ఆలోచించి ఓ నిర్ణయానికొచ్చింది. ఆమేరకు రెట్టింపు స్థాయిలో 12.5 ఎకరాలు అటు సంబంధిత రైతులకు, ఇటు శోత్రియందారుకు అప్పగించి, తక్కిన భూమిలో మాత్రమే టీచర్స్‌కు ఫ్లాట్స్ కేటాయించుకోవాలని 2022లో పాలకవర్గం తీర్మానించింది. ఇది ఇలా ఉండగా 2021లో శుభకీర్తి డెవలపర్స్ పేరిట 20 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయడంపై వివాదం తెరపైకి వచ్చింది.

రికార్డులేకున్నా రిజిస్ట్రేషన్....

పబ్బాపురం టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ పరిధిలో 20 ఎకరాలకు రైత్వారీ పట్టా ఒకటికి వెలుగులోకి తెచ్చారు. ఆ రైత్వారీ పట్టాకు చెందిన భూమి వెబ్ ల్యాండ్ రికార్డుల్లో లేదు. అయినప్పటికీ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం శుభకీర్తి డెవెలపర్స్ పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. ఈ మొత్తం వ్యవహారాన్ని హౌస్ బిల్డింగ్ సొసైటీ వెలుగులోకి తెచ్చింది. అప్పటి జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ జిల్లా రిజిస్ట్రార్, చింతకొమ్మదిన్నె తహశీల్దార్, టీచర్లుతో కలిపి ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తే 2021లో రైత్వారీ పట్టా కేటాయింపునకు చెందిన ఎలాంటి రికార్డులు అందుబాటులో లేవని స్పష్టమైంది. నకిలీ రైత్వారీ పట్టా సృష్టించినట్లు తేటతెల్లమైంది. వెబ్‌ల్యాండ్‌లో లేకపోయినా శుభకీర్తి డెవెలపర్స్‌కు రిజిస్ట్రేషన్ కావడం గమనార్హం. కాగా ఈ శుభకీర్తి డెవెలపర్స్ మైదుకూరు టీడీపీ నేత సూట్‌కేసు కంపెనీగా గుర్తించారు.

సొసైటీ కార్యాలయంపై దాడి


ఉపాధ్యాయ దినోత్సవం రోజున హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యాలయాన్ని ప్రారంభించి కార్యక్రమాలను వేగవంతం చేయాలనే నిర్ణయానికి పాలకవర్గం వచ్చింది. ఆమేరకు కార్యాలయం రెడీ చేసుకోగా, కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు కార్యాలయంపై దాడి చేశారు. ఆ కార్యాలయానికి ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మీటరు, ఫ్యాన్లు విరగొట్టారు. ఈ వ్యవహారం పచ్చ నేతల కనుసన్నల్లోనే జరిగిందని టీచర్లు ఆరోపిస్తున్నారు. ఇదివరకూ లేని రికార్డులు సృష్టించుకొని హౌస్ బిల్డింగ్ సొసైటీ భూభాగంలోకి ప్రవేశించారు. కార్యాలయం ఏర్పాటు చేసుకుంటే కార్యాకలాపాలు వేగవంతం అవుతాయని భావించి, ఇలాంటి దుశ్చర్యకు పాల్పడ్డారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

35 ఏళ్లుగా నిరీక్షణ



టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కొనుగోలు చేసిన భూమిని ఎలాగైనా కాజేయాలని కొందరు అక్రమార్కులు విశ్వప్రయత్నం చేస్తున్నారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టిస్తున్నారు. ఆపై దౌర్జన్యం చేస్తున్నారు. ఇది వరకూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారు సానుకూలంగా స్పందించినా టీచర్లకు 35ఏళ్లుగా నిరీక్షణ తప్పడం లేదు. కార్యాలయంపై దాడి దుర్మార్గం. కొనుగోలు చేసిన స్థలాన్నీ దక్కించుకోలేకపోతున్నాం. –బాలశౌరిరెడ్డి, టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు

ఉపాధ్యాయ దినోత్సవం రోజే దౌర్జన్యం



ఉపాధ్యాయ దినోత్సవం నాడే దౌర్జన్యానికి పాల్పడ్డారు. టీచర్లు తమ సొంత డబ్బుతో కొనుగోలు చేసిన స్థలాన్ని కాజేసేందుకు అనేక అక్రమమార్గాల ద్వారా కొందరు ప్రయత్నిస్తున్నారు. భయాందోళనలు సృష్టిస్తున్నారు. సొంత ఇంటి కల నెరవేర్చుకోకుండా కొంతమంది సభ్యులు ఇప్పటికే మృతి చెందారు. ఇంకెంతకాలం ఇలాంటి దౌర్జన్యకర ఘటనలు అధిగమించి ఫ్లాట్స్ చేజిక్కించుకోవాలో అర్థం కాలేదు. ఉన్నతాధికారులు అండగా నిలవాల్సిన ఆవశ్యకత ఉంది. – సి విశ్వనాథరెడ్డి, సెక్రెటరీ, టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ